క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను తిలకిస్తున్న జడ్జి నీలిమ

జగిత్యాలజోన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జగిత్యాల క్లబ్‌లో న్యాయవాదుల షటిల్ పోటీలను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కోర్టుల్లో ఎప్పుడూ బిజీగా ఉండే న్యాయవాదులు క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యమే కాకుండా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి శర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమి రమణకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలి



మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాలరూరల్: బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ నిరంతరం బలోపేతానికి కృషి చేయాలన్నారు. తిరిగి కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చేలా పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు పడిగెల గంగారెడ్డి, కమలాకర్‌రావు, వేణు, శరత్, సృజన్, మురళీ, ప్రభు, ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

రాయికల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం బల్దియాలోని 4,5,6 వార్డులతో పాటు, మండలంలోని ఒడ్డెలింగాపూర్, వీరాపూర్, ఇటిక్యాల, రామారావుపల్లి, రాజనగర్, కట్కాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ డీఈవో రాము, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రమాదేవి, తహసీల్దార్ ఖయ్యూం, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వారి బేగం, ఎంపీవో సుష్మ పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలని సీఎంకు లేఖ

జగిత్యాల: వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ లేఖ రాశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకే ఒక్కసారి కొత్త పింఛన్లు ఇచ్చారని, చాలా మంది లబ్ధిదారులు పింఛన్లు రాక ఇబ్బందులకు పడుతున్నారని పేర్కొన్నారు. వితంతువులు పిల్లలను పోషించలేక నానా తంటాలు పడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యం వస్తే మనుగడ లభిస్తుందని అందరూ భావించినప్పటికీ ఇప్పటికైనా పింఛన్లు ఇవ్వాలని కోరారు.

విహార యాత్రలతో విజ్ఞానం



ఆలయంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు

పెగడపల్లి: ఏదైన ప్రదేశాల గురించి వినడం కన్నా కళ్లతో నేరుగా చూడటం ద్వారా విద్యార్థులకు పూర్తి విషయాలు తెలుస్తాయని నంచర్ల పీఎస్ హెచ్‌ం సుబ్బారావు అన్నారు. మండలంలోని నంచర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం గంగాధర మండలం కోట్ల వీరభద్రస్వామి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలతో పాటు నారాయణపూర్ రిజర్వాయర్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా ప్రదేశాల గురించి తెలియజేయాలంటే క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి చూపించాలన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విహార యాత్ర బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ శివారులోని శ్రీలక్ష్మివెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శకుంతల దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల వీరంగం

- బయటకెళ్లాలంటే జంకుతున్న జనం
- కుక్కల స్వైరవిహారంతో ప్రజలకు ఇబ్బందులు
- వాహనదారులను వెంబడించి దాడులకు తెగబడుతున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యం



మెట్‌పల్లి మండలంలో వీధికుక్కల స్వైరవిహారం

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు తెగబడుతున్నాయి. ఏ వైపుగా ఏ కుక్క దాడి చేస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బయటకు వెళ్తున్న వ్యక్తులు తిరిగి క్షేమంగా ఇంటికి వెళ్లే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇంటి నుంచి బయటికెళ్లాలంటేనే భయపడుతున్నారు.అప్పటి వరకు బాగానే ఉంటున్న కుక్కలు, ఉన్నట్టుండి ఒక్కసారిగా దాడులకు పాల్పడుతున్నాయి. మరోవైపు కుక్కల బెడదను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆసుపత్రులకు బాధితుల పరుగు..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో చాలా మంది కుక్కకాటుకు గురవుతున్నారు.దీంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.పలువురు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తుండగా, మరికొందరు జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు.ఈ రెండు ఆసుపత్రుల్లో కుక్కకాటు కేసులు తరచూ నమోదవుతూనే ఉన్నాయి. జగ్గాసాగర్, ఆత్మనగర్, ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్, కొండ్రికర్ల, కోనరావుపేట, రంగారావుపేట గ్రామాల నుంచి కుక్క కాటుకు గురైన బాధితులు ఎక్కువగా వెళ్తున్నట్లు సమాచారం

నియంత్రణపై నిర్లక్ష్యం..

వీధి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కుక్కల సంతతి పెరగకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ద్వారా నియంత్రణకు చర్యలు చేపట్టాలి. కానీ అలాంటి ప్రక్రియ జరగకపోవడంతో కుక్కల బెడద పెరిగిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుక్కల దాడిలో వందల సంఖ్యలో జనం గాయపడుతన్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

అప్రమత్తత తప్పనిసరి..

కుక్క కాటుతో రేబిస్ సోకే ప్రమాదం ఉందని, 24 గంటల్లోపు వైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా కుక్కల బెడద తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో వ్యాక్సిన్



కుక్క కరిచిన బాధితులు ఈ మధ్య ఎక్కువగా వస్తున్నారు. వారికి చికిత్స చేస్తున్నాం .రేబిస్ నివారణ వ్యా క్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కరిచిన బాధితులు గాయమైన చోట వెంటనే మొదట సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. వీలైనంత త్వరగా చికిత్స చేయించుకోవాలి. కుక్క కరిచిన మొదటిరోజు 3,7,21 వ రోజుల్లో మొత్తం నాలుగుసార్లు క్రమం తప్పకుండా రేబిస్ నివారణ వ్యాక్సిన్ తీసుకోవాలి.

– అంజిత్‌రెడ్డి, మండల వైద్యాధికారి,మెట్‌పల్లి



కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి అనుబంధమైన శాంతినగర్ కాలనీలో లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం నిర్మించారు. రికార్డుల ప్రకారం ప్రభుత్వ పాఠశాలగా ఉన్నప్పటికీ దీనిలో తరగతులు నిర్వహించడం లేదు. పాఠశాల భవనం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లోకిని శ్రీనివాస్ ఎంఈవో, కథలాపూర్, సెల్ నంబర్: 9440536382

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాం



మల్యాల మండలం సర్వాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి

మల్యాల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని, అర్హులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి అన్నారు. మల్యాల మండలంలోని సర్వాపూర్‌లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి పాల్గొన్నారు. వివిధ పథకాలకు అర్హుల జాబితాను చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేనివారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెగడపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే పథకాలు వర్తిం పజేస్తామని అధికారులు అన్నారు. పెగడపల్లి మండలంలోని లింగాపూర్, మద్దులపల్లి, మ్యాకవెంకయ్యపల్లి, నామాపూర్, దీకొండ, నందగిరి గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. లబ్ధిదారుల ముసాయిదా జాబితాను చదివి వినిపించారు.

కథలాపూర్: మండలంలోని ఊటిపెల్లి, భూషణరావుపేట, కథలాపూర్, పోసానిపేట, పోతారం గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలో రేషన్‌కార్డు దరఖాస్తుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. కార్యక్రమాల్లో

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో బుధవారం ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు.అర్హులైనప్పటికీ దరఖాస్తు చేసుకున్నప్పటికి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు.

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభ రసాభాసగా మారింది. స్పెషల్ ఆఫీసర్ గా తహసిల్దార్ నిర్వహించిన గ్రామసభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. సంక్షేమ పథకాల్లో తమ పేర్లు రానివారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సారంగాపూర్: సారంగాపూర్ మండలం భీంరెడ్డిగూడెం, పోతారం, ధర్మనాయక్‌తండా, పోచంపేట, బీర్‌పూర్ మండలం కండ్లపల్లి, బీర్‌పూర్, రేకులపల్లి, తాళ్ళధర్మారం, నర్సింహులపల్లె గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు.

బుగ్గారం: అర్హులైన వారి పేర్లు పథకాల జాబితాలో లేనందున మరోసారి గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయాలని మండలంలోని మద్దునూర్ గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు. గ్రామసభలో వినతిపత్రం అందించారు.

మల్లాపూర్: మండలంలోని నడికుడ, రాఘవపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ పథకాల లబ్ధిదారులుగా అనర్హులను ఎంపిక చేయడంపై గ్రామస్తులు అధికారులను నిలదీశారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదల వైద్యానికి ప్రభుత్వం చేయూత



వివేకానందుడి విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: నిరుపేదల వైద్యానికి ప్రభుత్వం చేయూతనందిస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లి గ్రామానికి చెందిన ముక్కెర రాజ్‌కుమార్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా అతని వైద్యం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50 లక్షల విలువ గల ఎల్‌వోసీని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహం ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: స్వామి వివేకానందుడిని నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో బుధవారం స్వామి వివేకానంద విగ్రహాన్ని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి ప్రారంభించారు. వివేకానందుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు, యువకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏలేటి మమత, నాయకులు

కొండగట్టు: కొడిమ్యాల మండల బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని బుధవారం కొడిమ్యాల మాజీ సర్పంచ్ ఏలేటి మమత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండ సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి, సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మూత్రశాలలు లేక ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సల్మాన్,నరసింహారెడ్డి,రవీందర్ రెడ్డి ఉన్నారు

సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి



తిమ్మాపూర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలతో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు రెడ్‌కో ఏడీవో లక్ష్మీకాంతరావు అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, పొలాస, నర్సింగాపూర్, చల్‌గల్, తాటిపల్లి గ్రామాల్లో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించి సోలార్ ప్లాంట్ నిర్మాణం చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అలాగే సెర్ప్ ఏపీడీ చరణ్‌దాస్, విద్యుత్ శాఖ ఏడీ జవహర్‌లాల్ నాయక్, ఏపీఎం గంగాధర్, సర్వేయర్లు నవీన్, సీసీలు గంగారాం, రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



గోదాం ప్రహరీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని పూడుర్,నాచుపెల్లి గ్రామంలో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాచుపల్లిలో గోదాం ప్రహరీ, పూడూరులో గోదాం బిల్డింగ్‌ను ప్రారంభించారు

హలో మాదిగ చలో హైదరాబాద్



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడిపల్లి: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న 'లక్ష డప్పులు వెయ్యి గొంతులు' కార్యక్రమానికి ప్రతి ఒక్క మాదిగ బిడ్డ డప్పు వేసుకుని తరలి రావాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘాల మండల అధ్యక్షుడు బంగారు దీపక్ అన్నారు. మేడిపల్లిలో మాదిగ కుల సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎస్సీల్లో సఅఖ్య కులాలకు జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలనే సామాజిక న్యాయం కొరకు ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నిరంతర పోరాటం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు డప్పు ప్రేమ్ సాగర్, ప్రధాన కార్యదర్శి మకిలి సురేష్, ఎర్ర జగన్, ప్రణయ్, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

కబడ్డీ పోటీల్లో మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలరూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేశసముద్రంలో ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు శాన్వి, ఇందుప్రియ ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపల్ నగేశ్, పీడీ వినిత్‌కుమార్, అజీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజ్ బహాదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో రాజ్ బహాదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కొప్పెర వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లిలో బుధవారం రెడ్డి కులస్తులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, భూమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

మల్లాపూర్: మండలంలోని సాతారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బుధవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు అడ్డిగ శ్రీనివాస్ మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

కథలాపూర్: ఎస్సీ వర్గీకరణ కోసం వచ్చే నెల 7న ×చలో హైదరాబాద్×ె నిర్వహిస్తున్నామని, గ్రామాల నుంచి మాదిగలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి తెడ్డు శేఖర్ కోరారు. మండలంలోని తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పుల కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు శనిగారపు గణేశ్, నల్ల గంగాధర్, పొడెటి అర్జున్, భూమగంగారాం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు



రాంబాబును అభినందిస్తున్న రైస్ మిల్లర్లు

జగిత్యాలరూరల్: జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మైలారపు రాంబాబును ఎన్నికున్నారు. రాంబాబును పలువురు అభినందించారు.

పథకాల మంజూరు నిరంతర ప్రక్రియ

మెట్‌పల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు నిరంతర ప్రక్రియ అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని 9 వార్డులో జరిగిన వార్డు సభలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలు పథకాల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మోహన్, కౌన్సిలర్ బాల్క ముత్తమ్మ తదితరులున్నారు.

కల్యాణ వేదికకు విరాళం

రాయికల్: పట్టణంలోని శివాలయంలో నూతనంగా నిర్మించే కల్యాణ వేదిక సహస్ర దీప మండప నిర్మాణం కోసం దుబాయ్‌లోని శివసేవ యువకులు గోనె మహేశ్ దేవ, గోనె మహేశ్‌లు రూ.44 వేల విరాళం పంపించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఎలగందుల రమేశ్ బుధవారం తెలిపారు.

పశువైద్యాధికారిని నియమించాలి

వెల్గటూర్ : మండలంలోని పైడిపెల్లి పశువైద్యశాలకు వైద్యాధికారిని నియమించాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి హరీశ్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మండల పశువైద్యాధికారి శ్రీప్రియకు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలకు గర్భకోశ, చూడి పరీక్షలు నిర్వహించారు. లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీప్రియ, ఎండపల్లి మండల పశువైద్యాధికారి మనోజ్ కుమార్, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

జగిత్యాలరూరల్: రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల వెంకట్‌రెడ్డితో పాటు, కార్యవర్గ సభ్యులను మోరపల్లిలో రెడ్డి సంఘం సభ్యులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, లింగారెడ్డి, భూమారెడ్డి, నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులు కుటుంబాలకు మార్గదర్శకులు



వృద్ధులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: వృద్ధులు కుటుంబాలకు, సమాజానికి మార్గదర్శకులని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో తాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారిని సన్మానించారు. పోలాండ్ దేశంలో తాతల దినోత్సవం ప్రారంభమైందని, ప్రస్తుతం అన్ని దేశాల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, ప్రకాశ్‌రావు, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు ఎంపీ ఆర్థికసాయం

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి: ఎంపీ ధర్మపురి అర్వింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 13 మంది బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలకు ఆర్థిక సాయం అందజేశారు. చెక్కులను బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్ సంబంధిత కార్యకర్తలకు పంపిణీ చేశారు.

రాయికల్: మండలంలోని ఒడ్డె లింగాపూర్‌గ్రామానికి చెందిన అనుపురం హరీశ్ అనే కార్యకర్త మూడునెలల క్రితం ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి పడి చనిపోగా, ధర్మపురి ఫౌండేషన్ నుంచి మృతుడి భార్య నిఖితకు బుధవారం రూ.లక్ష చెక్కు అందజేశారు.

ఇబ్రహీంపట్నం: బూత్ స్థాయి కార్యకర్తలకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంక్షేమ నిధి ద్వారా రూ.1.4 లక్షల చెక్కులను బుధవారం అందజేసినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు బాయి లింగారెడ్డి తెలిపారు. ఐదుగురు బూత్ స్థాయి కార్యకర్తలకు రూ. 20 వేల చొప్పున, రోడ్డు ప్రమాదంలో గాయపడిన బత్తుల శ్రీనివాస్ రూ.40 వేల చెక్కు అందజేశారు.